


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
24-03-2026
పేజీలు: 02



## విజయవాడలో ఉగ్రవాదుల కలకలం

విజయవాడలో ఉగ్రవాద లింకులు వెలుగు చూడటం రాష్ట్రాన్ని ఒక్కసారిగా భయాందోళనకు గురి చేసింది. ఈ వార్త తెలిసి స్థానికులు ఉలిక్కిపడ్డారు. విజయవాడ నగరంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న ముగ్గురు యువకులు గత కొంత కాలంగా సోషల్ మీడియా వేదికల్లో.. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు పలుకుతున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. వీరు ఉగ్ర గ్రూపులకు సానుభూతిపరులుగా వ్యవహరిస్తూ.. యువతను తప్పుదోవ పట్టించేలా పోస్టులు పెడుతున్నట్లు సమాచారం అందడంతో.. రంగంలోకి దిగిన కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు.. మొహ్మద్ రహమతుల్లా షరీఫ్, మీర్జా సొహైల్ బేగ్, మొహ్మద్ డానిష్ అనే ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు.. వీరిని ప్రశ్నిస్తున్నారు. ఈ యువకులకు పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లతో సంబంధాలున్నట్లు అధికారులు గుర్తించారు. విజయవాడ, వన్ టౌన్ ప్రాంతంలో ఉన్న ఓ మసీదులో ఈ ముగ్గురు యువకులకు పరిచయం ఏర్పడింది. వీరు సోషల్ మీడియా వేదికగా.. దేశ వ్యతిరేక పోస్టులు చేస్తూ.. వివిధ ప్రాంతాల్లో యువకులను ఉగ్రవాదం వైపు మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని ఇంటెలిజెన్స్ అధికారులు గుర్తించారు. వీరిపై కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.



## మార్చి 28న OUలో భారీ జాబ్ మేళా

హైదరాబాద్ నగరంలోని నిరుద్యోగ యువతకు శుభవార్త. మార్చి 28న ఉస్మానియా యూనివర్సిటీలో భారీ జాబ్ మేళా నిర్వహించబోతున్నట్లు ఓయూ ఎంప్లాయిమెంట్ బ్యూరో ప్రకటించింది. 'భగవతి ప్రొడక్ట్స్ లిమిటెడ్ (ఫాబ్ సిటీ, రంగారెడ్డి)' సహకారంతో ఈ నెల 28న ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈ జాబ్ మేళా నిర్వహించబోతున్నట్లు ఓయూ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ చీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 28, 2026 శనివారం ఉదయం 11:00 గంటలకు ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయం, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా, ఓయూలో ఈ జాబ్ మేళా నిర్వహించనున్నారు. మార్చి 28న నిర్వహించే జాబ్ మేళా ద్వారా ఒకేసారి 100 అప్రెంటిస్ ట్రైనీ పోస్టులను భర్తీ చేయబోతున్నారు. బీటెక్ (EEE, ECE), డిప్లొమా (EEE, ECE) ఉత్తీర్ణులైన యువతీ యువకులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. 18-35 సంవత్సరాల వయస్సు ఉన్న వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు.


# క్రిస్టియన్ గా మారితే ఎస్సీ హక్కులు రద్దు

### సుప్రీం కోర్టు సంచలన తీర్పు

మత మార్పిడి, రిజర్వేషన్ల అంశంపై దేశ అత్యున్నత న్యాయస్థానం మంగళవారం ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. హిందూ మతాన్ని వీడి క్రైస్తవ మతంలోకి మారి.. ఆ మత ఆచారాలను పాటించే వ్యక్తి షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదాను పొందేలేరని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎస్సీ హోదా అనేది కేవలం హిందూ, సిక్కు, బౌద్ధ మతస్థులకు మాత్రమే పరిమితమని ధర్మాసనం తేల్చి చెప్పింది. జస్టిస్ పి.కె. మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజరియా నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తూ.. 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులను ప్రస్తావించింది. ఆ ఉత్తర్వుల్లోని 3వ నిబంధన ప్రకారం.. పేర్కొన్న మూడు మతాలు తప్ప ఇతర మతాల్లోకి మారిన వ్యక్తి పుట్టుకతో ఎస్సీ అయినప్పటికీ.. ఆ హోదాను తక్షణమే కోల్పోతారని కోర్టు వివరించింది. "ఇందులో ఎలాంటి సందిగ్ధత లేదు. మతం మారిన వ్యక్తికి రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణలు, ఎలాంటి ప్రయోజనాలు వర్తించవు" అని న్యాయమూర్తులు స్పష్టం



చేశారు. ఆంధ్ర ప్రదేశ్ బాపట్ల జిల్లాలోని పిట్టలవాని పాలెం గ్రామానికి చెందిన ఓ ఎస్సీ వ్యక్తి హిందూ మతాన్ని వీడి.. క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. ఆపై పాస్టర్‌గా మారి ఓ చర్చిలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అయితే కొంత కాలం క్రితం ఆయన తనపై కొందరు దాడి చేశారని, కులం పేరుతో దూషించారని పేర్కొంటూ ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కింద పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. ఫిర్యాదుదారుడు ఇప్పటికే క్రైస్తవ మతంలోకి మారి పాస్టర్‌గా పని చేస్తున్నారని.. కాబట్టి ఆయనకు ఎస్సీ చట్టం కింద రక్షణ పొందే హక్కు లేదని వాదించారు. గతంలో ఏపీ హైకోర్టు కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పింది. ఒక వ్యక్తి క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నప్పుడు.. ఆయన ఎస్సీ హోదా ఆటోమేటిక్‌గా రద్దు అవుతుందని, ఫలితంగా ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేయడం చట్టబద్ధం కాదని పేర్కొంది. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు.. హైకోర్టు నిర్ణయం సరైనదేనని వెల్లడించింది. ఒకే సమయంలో వేరొక మతాన్ని ఆచరిస్తూ.. ఎస్సీ హోదాను అనుభవించడం అసాధ్యమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.



## గౌతమ్ మీనన్‌కి షాకిచ్చిన హైకోర్టు

ప్రముఖ దర్శకుడు గౌతమ్ మీనన్‌కి మద్రాస్ హైకోర్టు షాకిచ్చింది. అతని ప్రొడక్షన్ హౌస్ ఫోటాన్ ఫ్యాక్టరీ దాఖలు చేసిన అప్పీల్‌ను తిరస్కరించింది. పైగా ఈ కేసులో గౌతమ్ మీనన్.. ఆర్ ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్‌కు రూ. 4.25 కోట్లు చెల్లించాలని.. అది కూడా 2010 మే నుండి ఇప్పటి వరకు.. సంవత్సరానికి 12 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని గతంలో ఇచ్చిన తీర్పును తాజాగా కోర్టు సమర్థించింది. ఈ వివాదం 2008 నవంబర్ 27న ప్రారంభమైంది. ప్రొడక్షన్ నెం. 6 సినిమా కోసం గౌతమ్ మీనన్ సంస్థ ఫోటాన్ ఫ్యాక్టరీ.. నిర్మాత ఎల్రెడ్ కుమార్ (ఆర్.ఎస్. ఇన్ఫోటైన్‌మెంట్)తో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం.. 2009, ఏప్రిల్ 5 నాటికి ఈ సినిమా పూర్తవ్వాలి. ఈ క్రమంలో నిర్మాత పలు విడతల్లో రూ. 4.25 కోట్లు చెల్లించారు. కానీ ఒప్పందం ప్రకారం_ _ _ అనుకున్న సమయానికి ఆ సినిమా షూటింగ్ ప్రారంభం కాలేదు. దీంతో 2010 ఫిబ్రవరి 12 వరకు అదనపు గడువు కూడా ఇచ్చారు. అయినా ఆ ప్రాజెక్ట్ పూర్తి కాలేదు. దీంతో నిర్మాత 2013లో ఈ అంశంపై సివిల్ సూట్ వేశారు. సినిమా నిర్మాణం కోసం తాను రూ. 4.25 కోట్లు పలు దఫాలుగా ఇచ్చానని.. కానీ నిర్ణీత సమయంలో సినిమా ప్రారంభం కాలేదని తెలిపారు. నిర్ణీత గడువులో సినిమా పూర్తి కాకపోతే.. ఆ మొత్తానికి 24 శాతం వడ్డీతో చెల్లిస్తామనే క్లాజ్ కూడా ఉందని కోర్టుకి తెలిపారు.



## హైదరాబాద్‌కు 915 ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్ రవాణాలో కొత్త దశ ప్రారంభం. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద హైదరాబాద్‌కు 915 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరైనట్లు కేంద్రం తెలిపింది. CESL నేతృత్వంలో ఈకేఏ మొబిలిటీ-గ్రీన్ సెల్ కన్సార్టియం ద్వారా ఈ ప్రాజెక్ట్ అమలు కానుంది. నగర అవసరాలకు 100 మినీ బస్సులు, 815 12-మీటర్ల స్టాండర్డ్ ఫ్లోర్ బస్సులు అందుబాటులోకి వస్తాయి. పూర్తి ఎలక్ట్రిక్ వెహికల్స్ కావడంతో కాలుష్య ఉద్గారాలు ఉండవు. సురక్షిత, సౌకర్యవంతమైన, పర్యావరణహిత రవాణా సేవల కోసం నగర వాసులు ఈ కొత్త బస్సులను ఆస్వాదించనున్నారు.



## లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు 50 శాతం పెంపు

కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. లోక్‌సభ, అన్ని రాష్ట్రాల్లోని అసెంబ్లీ స్థానాలను 50 శాతం పెంచాలని నిర్ణయించింది. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టడానికి రంగం సిద్ధమైనట్లు సమాచారం. ఈ బిల్లు చట్టంగా మారితే.. ఇప్పటివరకు ఉన్న పార్లమెంటు స్థానాలు 543 నుంచి 816కి పెరుగుతాయి. అలాగే రాష్ట్రాలన్నింటిలో కలిపి మొత్తం 4,123 ఉన్న అసెంబ్లీ స్థానాల సంఖ్య 6,185కి పెరుగుతుంది. మిగతా రాష్ట్రాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కూడా లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయి. ఆంధ్రప్రదేశ్: ప్రస్తుతం ఏపీలో ఉన్న 175 ఎమ్మెల్యే స్థానాలు 263కి పెరుగుతాయి. అలాగే లోక్‌సభ స్థానాల సంఖ్య 25 నుంచి 38కి పెరుగుతుంది. తెలంగాణ: ఇటు తెలంగాణలో కూడా అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి చేరుతాయి. అలాగే లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి చేరే అవకాశం ఉంటుందని అంటున్నారు. సమాచారాన్ని సోమవారం సాయంత్రం కేంద్రం.. ఎన్డీయే (NDA) సమావేశంలో భాగస్వామ్య పక్షాలకు వెల్లడించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌ల నేతృత్వంలో ఈ భేటీ జరిగింది. ఇదే అంశంపై కాంగ్రెసేతర విపక్షాలతోనూ ప్రత్యేకంగా భేటీ నిర్వహించారు. ఈ క్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ అంశంపై కాంగ్రెస్‌తో మాట్లాడే అవకాశం ఉంది. అయితే నియోజకవర్గాల సంఖ్య పెంచడానికన్నా ముందుగా.. మహిళా రిజర్వేషన్ చట్టం, డీలిమిటేషన్ చట్టాలకు సవరణలు ప్రతిపాదిస్తూ బిల్లులను ఈ పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఇవి ఆమోదం పొందిన తర్వాత.. కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసి సీట్ల పెంపు కార్యక్రమాన్ని పూర్తి చేసి 2029 ఎన్నికల్లో వాటిని అమలు చేయనున్నట్లు తెలుస్తోంది.



## ఇరాన్‌పై దాడులు ఆగవు: ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

పశ్చిమాసియాలో శాంతి ప్రయత్నాలు జరుగుతున్నా.. ఇజ్రాయెల్ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఇరాన్‌పై దాడులకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బ్రేక్ ఇచ్చినా.. తాము మాత్రం ఆగేదే లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు. ఇరాన్, లెబనాన్‌లపై దాడులు కొనసాగుతాయని ఆయన తెలిపారు. దాడుల్లో సాధించిన విజయాలే డీల్‌లో పైచేయి సాధించడానికి కీలకం అవుతాయని భావిస్తున్నట్లు ట్రంప్ తనతో చెప్పారని నెతన్యాహు పేర్కొన్నారు.



## UPIతో క్రెడిట్ కార్డు వినియోగం.. సిబిల్ పెరుగుతుందా!

డిజిటల్ చెల్లింపులు విస్తరిస్తున్న నేపథ్యంలో, యూపీఐతో క్రెడిట్ కార్డులను అనుసంధానించి లావాదేవీలు చేయడం పెరిగింది. చిన్న మొత్తాల చెల్లింపుల కోసం క్రెడిట్ కార్డు వాడటం క్రెడిట్ స్కోర్‌ను మెరుగుపరుస్తుందా అనే సందేహాలు వినియోగదారుల్లో ఉన్నాయి. లావాదేవీల పరిమాణం కంటే చెల్లింపుల క్రమశిక్షణ కీలకమని నిపుణులు అంటున్నారు. బిల్లును సమయానికి పూర్తిగా చెల్లించడం, క్రెడిట్ యుటిలైజేషన్ రేషియోను 30% లోపు ఉంచుకోవడం ద్వారా సిబిల్ స్కోర్ మెరుగుపడుతుంది. అయితే, అధిక ఖర్చు వల్ల బిల్లు పెరిగి, చెల్లింపులు తప్పితే స్కోర్ దెబ్బతినే ప్రమాదం ఉంది.



## శ్రీలీల లేటెస్ట్ లుక్

ఎప్పుడొచ్చాం అన్నది కాదన్నాయ్... బుల్లెట్ దిగిందా? లేదా? అని కాస్త మాస్‌గానే అంటున్నారు కిస్సిక్ బ్యూటీ శ్రీలీల. అందం ఉంది, మంచి పెర్ఫార్మర్ అనే పేరుంది.. స్పీడు స్టెప్పులకి, గ్లామర్ రోల్స్ కీ కేరాఫ్ అయ్యే కెపాసిటీ ఉంది.. ఇన్ని ఉన్నా ఉన్నట్టుండి ఆ మధ్య కెరీర్‌లో స్పీడు తగ్గించారు శ్రీలీల. మన దగ్గర ఇప్పటికీ మునుపటి స్పీడును అందుకోలేకపోతున్నారనే కంప్లయింట్ కూడా ఉందనుకోండి.. ఈ వైరల్ వయ్యారి మీద. కెరీర్ బిగినింగ్‌లో శ్రీలీల చూపించిన జోరును.. లాస్ట్ ఇయర్ మీనాక్షి చౌదరి అందుకున్నారు.

## రేవంత్ రెడ్డిని నేనే సీఎం చేశా

### మాజీ మంత్రి మల్లారెడ్డి




రేవంత్ రెడ్డిని తానే సీఎంని చేశానని, రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ ఒక్కడే పవర్ ఫుల్ లీడర్ అని ఆయన మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. రేవంత్, తాను అన్నదమ్ములమని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ వ్యాఖ్యలతో మల్లారెడ్డి త్వరలోనే కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం ఊపందుకుంది. బీఆర్ఎస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు సీఎంతో ఉన్న సాన్నిహిత్యం గురించి బహిరంగంగా మాట్లాడటం వెనుక వ్యూహం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సినిమాల గురించి మాట్లాడుతూ, 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో విలన్ పాత్రకు నో చెప్పానని, సీఎం పాత్ర చేయాలని ఉందని తన కోరికను వెల్లడించారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## టెక్సాస్ ఆయిల్ రిఫైనరీలో భారీ పేలుడు

అమెరికాలోని ఓ ఆయిల్ రిఫైనరీలో భారీ పేలుడు సంభవించింది. టెక్సాస్‌లోని పోర్ట్ ఆర్థర్‌లో ఉన్న వలెరో రిఫైనరీలో ఈ ఘటన చోటుచేసుకున్నది. భారీ ఎత్తును మంటలు వ్యాపించాయి. దట్టమైన నల్లటి పొగ ఆ ప్రాంతాన్ని కమ్ముకున్నది. పేలుడు సమయంలో భారీ శబ్ధం వచ్చినట్లు స్థానికులు చెప్పారు. కొన్ని మైళ్ల దూరం వరకు భూమి కంపించినట్లు వెల్లడించారు. పోర్ట్ ఆర్థర్‌లో అప్రమత్తత ప్రకటించారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారి గురించి ఇంకా ఎటువంటి సమాచారం లేదని జెఫర్‌సన్ కౌంటీ షరీఫ్ జీనా స్టీఫెన్స్ తెలిపారు. ఏ కారణం చేత పేలుడు జరిగిందో ఇంకా నిర్ధారించలేకపోయినట్లు పోర్ట్ ఆర్థర్ ఫైర్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఆంటోనియో మిచెల్ పేర్కొన్నారు. టెక్సాస్ గల్ఫ్ కోస్టులో ఉన్న రిఫైనరీల్లో వలెరో అతిపెద్దది. ఇక్కడ ప్రతి రోజు సుమారు నాలుగున్నర లక్షల బ్యారెళ్ల క్రూయిడ్ ఆయిల్‌ను రిఫైన్ చేస్తారు. ఇరాన్‌పై దాడి వల్ల ప్రస్తుతం అమెరికాలో ఇంధన ధరలు ఆకాశాన్ని అంటాయి. ఇక పోర్ట్ ఆర్థర్ రిఫైనరీ పేలుడు ఘటనతో పరిస్థితి మరింత తీవ్రం కానున్నట్లు భావిస్తున్నారు.



## ప్రముఖ గాయకుడు రోనీ బోమాన్ కన్నుమూత

ప్రముఖ అమెరికన్ గాయకుడు, బ్లూగ్రాస్ మరియు కంట్రీ మ్యూజిక్ లెజెండ్ రోనీ బోమాన్ (64) కన్నుమూశారు. మార్చి 22న టేనస్సీలోని నాష్‌విల్లేలో జరిగిన ఒక మోటార్‌సైకిల్ ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. శనివారం మధ్యాహ్నం ఆష్‌ల్యాండ్ సిటీ సమీపంలో రోనీ ప్రయాణిస్తున్న బైక్ ప్రమాదానికి గురవ్వగా, తీవ్ర గాయాలైన ఆయనను వెంటనే నాష్‌విల్లేలోని వాండర్‌బిల్ట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరుసటి రోజు సోమవారం మధ్యాహ్నం ఆయన తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. రోనీ బోమాన్ తన అద్భుతమైన గాత్రంతో, పాటల రచనతో ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్నారు. ఇంటర్నేషనల్ బ్లూగ్రాస్ మ్యూజిక్ అసోసియేషన్ (IBMA) నుంచి దాదాపు మూడుసార్లు 'మేల్ వోకలిస్ట్ ఆఫ్ ది ఇయర్' (1995, 1998, 1999) అవార్డులను అందుకుని రికార్డు సృష్టించాడు. అంతేగాకుండా 1990 నుంచి 2001 వరకు 'ది లోన్‌సమ్ రివర్ బ్యాండ్'లో కీలక సభ్యుడిగా ఉన్న ఆయన, ఆ తర్వాత సోలో సింగర్‌గా మరియు సాంగ్ రైటర్‌గా రాణించారు. ఆయన రాసిన పాటలను క్రిస్ స్టేపుల్టన్, కెన్నీ చెస్నీ వంటి హాలీవుడ్ అగ్రశ్రేణి కంట్రీ స్టార్లు ఆలపించడం విశేషం. ఇక రోనీ బోమాన్ మృతి పట్ల సంగీత ప్రపంచం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

## భారతీయులకు కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నాం: మోదీ



లోక్‌సభలో ప్రధాని మోదీ పశ్చిమాసియా యుద్ధంపై ఆందోళన వ్యక్తం చేశారు. మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ యుద్ధం ప్రపంచంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, భారత్‌కు అనేక సవాళ్లను తెచ్చిపెట్టిందని ఆయన అన్నారు. యుద్ధంలో చిక్కుకున్న భారతీయులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, అనేక దేశాధినేతలతో మాట్లాడామని తెలిపారు. ఇప్పటివరకు 3.75 లక్షల మందిని సురక్షితంగా భారత్‌కు తరలించామని, వీరిలో ఇరాన్ నుంచి 1000 మంది ఉన్నారని మోదీ పేర్కొన్నారు.మధ్యప్రాచ్యంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఈ యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. కరోనా మహమ్మారిని ఎదుర్కొన్నట్లే ఈ సంక్షోభాన్ని కూడా దేశం జయిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇంధన అవసరాల కోసం భారత్ 41 దేశాల నుంచి దిగుమతులు చేసుకుంటోందని, హర్మూజ్ జలసంధి ద్వారా సరఫరాలో అంతరాయం కలగడం సమస్యగా మారిందన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నామని తెలిపారు.

# ఆర్డీటీ సేవలపై మంత్రి లోకేశ్ కీలక ప్రకటన

తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సేవలు ఇకపై నిరంతరాయంగా కొనసాగనున్నాయి. ఈ సంస్థకు ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ) కింద లైసెన్స్ రెన్యువల్ పూర్తయినట్లు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. దీంతో ఆర్డీటీకి విదేశీ విరాళాల స్వీకరణకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు లోకేశ్ సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. ఆర్డీటీ సేవలు నిలిచిపోవని గతంలోనే మాట ఇచ్చానని, ఆ మేరకు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపినట్లు వివరించారు. పేదల ఇళ్ల నిర్మాణం, నిరుపేద పిల్లల చదువు, ఉపాధి, వైద్యం వంటి రంగాల్లో ఆర్డీటీ చేస్తున్న కృషిని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలకు వివరించినట్లు తెలిపారు. తమ విజ్ఞప్తి మేరకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని, దీంతో ఆర్డీటీ రెన్యువల్ ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చినందుకు ప్రధాని మోదీకి,



హోంమంత్రి అమిత్ షాతో పాటు కేంద్ర ప్రభుత్వ అధికారులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే దశాబ్దాలుగా సేవా స్ఫూర్తితో పనిచేస్తున్న ఆర్డీటీ నిర్వాహకులు మాంచో ఫెర్రర్‌కు అభినందనలు తెలిపారు. ఈ నిర్ణయంతో లక్షలాది మంది ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## ఐపీఎల్ 2026 కోసం బీసీసీఐ కొత్త రూల్స్

మార్చి 28 నుంచి ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం కానుంది. ఈ సీజన్‌కు ముందు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) కొత్త రూల్స్ తీసుకువచ్చింది. అయితే.. రూల్స్ ప్రేక్షకులు, మ్యాచ్‌లకు సంబంధించినవి కాదు. ఆటగాళ్లకు, ఫ్రాంచైజీలకు మాత్రమే. ఒకవేళ ఈ రూల్స్ ప్లేయర్లు గానీ, ఫ్రాంచైజీలు గానీ అతిక్రమిస్తే భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఇక పై మ్యాచ్ రోజుల్లో ఎలాంటి ప్రాక్టీస్ సెషన్లకు అనుమతి ఉండదని తెలిపింది. అంతేకాదండోయ్.. మ్యాచ్ జరిగే రోజుల్లో మైదానంలో ఫిట్‌నెస్ పరీక్షలను నిషేదించింది.ఇక ప్రాక్టీస్ రోజుల్లో డ్రెస్సింగ్ రూమ్, మైదానంలోకి ఆటగాళ్లతో పాటు గుర్తింపు పొందిన సిబ్బందినే అనుమతిస్తారు. ఇక ప్లేయర్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు వేరే వాహనాల్లో రావాల్సి ఉంటుంది. వారికి మైదానంలోకి ఎంట్రీ ఉండదు. హాస్పిటాలిటీ




ఏరియా నుంచి మాత్రమే వారు ప్రాక్టీస్ను వీక్షించాలి. అన్ని ఫ్రాంచైజీలు కూడా త్రోడౌన్ స్పెషలిస్ట్‌లు, నెట్ బౌలర్ల జాబితా వివరాలను బీసీసీఐకి ముందే సమర్పించాలి. ఇక ప్లేయర్లు ప్రాక్టీస్‌కు వచ్చేటప్పుడు టీమ్ బస్సులను మాత్రమే ఉపయోగించాలి. రెండు బృందాలుగా వారు ప్రయాణించవచ్చు. మ్యాచ్ రోజుల్లో ప్రాక్టీస్, ఫిట్‌నెస్ టెస్టుకు సంబంధించి ఎలాంటి అభ్యర్థన వచ్చిన స్థానిక మేనేజర్‌ను సంప్రదించాలి.



## ఇంపాక్ట్ ప్లేయర్‌పై అక్షర్ కామెంట్స్

ఐపీఎల్‌లో ఉపయోగించే ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనపై మరో క్రికెటర్ పెదవి విరిచాడు. ఈ నిబంధన ద్వారా ఆల్‌రౌండర్లకు అన్యాయం జరుగుతుందని వాదనలు వినిపిస్తున్న వేళ తాజాగా దీనిపై భారత స్టార్ ఆల్‌రౌండర్, ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్‌స్‌కు సారథిగా వ్యవహరిస్తున్న అక్షర్ పటేల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అక్షర్ మాట్లాడుతూ.. 'ఆ నిబంధన నాకు నచ్చదు. స్వతహాగా నేను ఆల్‌రౌండర్‌ను. గతంలో మేం ఈ రోల్ (బ్యాటింగ్, బౌలింగ్ చేసేవారు) కోసం ఆల్‌రౌండర్‌ను ఎంపిక చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం అవసరాన్ని బట్టి బ్యాటర్, బౌలర్‌ను వాడుకుంటున్నది. అదే సమయంలో మనకు ఆల్‌రౌండర్ అవసరమా? అన్న చర్చ తలెత్తుతున్నది. నేను దీనికి వ్యతిరేకమైనా రూల్స్ అంటే రూల్సే కదా. మనం వాటిని పాటించాలి' అని అన్నాడు. గతంలో రోహిత్ శర్మ, హార్ధిక్ పాండ్యా సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచిన విషయం తెలిసిందే.

## ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం


విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై ఇవాళ బీఆర్ఎస్వీ నాయకులు అసెంబ్లీని ముట్టడించారు. దీన్ని అడ్డుకున్న పోలీసులు.. వారిని నాంపల్లి, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్, తుంగ బాలు మాట్లాడుతూ.. ఉద్యమాలను అణిచివేయాలని చూడటం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యం అనిపించుకోదని అన్నారు. ఇది రాజ్యాంగ హక్కులను హరించడమే అని స్పష్టం చేశారు. ఇవాళ రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని మండిపడ్డారు. గురుకులాలను పట్టించుకోవడం లేదని.. ప్రభుత్వ బడులను గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలన్న సోయి కూడా ఈ ప్రభుత్వానికి లేదని వారు విమర్శించారు. నిరుద్యోగుల,




విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం సమీక్ష నిర్వహించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## డానిల్ మెద్వెదెవ్ చేతిలో ఓడిన అల్కరాజ్

పురుషుల టెన్నిస్ నంబర్ వన్ ర్యాంకు ప్లేయర్ కార్లోస్ అల్కరాజ్‌కు మరో షాక్. ఇటీవలే ముగిసిన ఇండియన్ వెల్స్ సెమీస్ పోరులో డానిల్ మెద్వెదెవ్ చేతిలో ఓడిన ఈ స్పెయిన్ కుర్రాడు తాజాగా మియామి ఓపెన్‌లో మూడో రౌండ్‌కే ఇంటిబాట పట్టాడు. మెన్స్ సింగిల్స్ థర్డ్ రౌండ్‌లో అల్కరాజ్.. 3-6, 7-5, 4-6తో సెబాస్టియన్ కొర్డా (యూఎస్ఏ) చేతిలో ఓటమిపాలయ్యాడు. ప్రపంచ 32వ ర్యాంకర్ అయిన కొర్డా.. 2 గంటల 19 నిమిషాల పాటు సాగిన పోరులో రెండో సెట్‌ను పోరాడి ఓడినా నిర్ణయాత్మక మూడో సెట్‌లో పుంజుకుని అల్కరాజ్‌కు షాకిచ్చాడు. తద్వారా నిరుడు ఇదే మియామి ఓపెన్‌లో ప్రపంచ 55వ ర్యాంకర్ డేవిడ్ గాఫిన్ తర్వాత అల్కరాజ్‌ను ఓడించిన లోయెస్ట్ ర్యాంక్ ప్లేయర్‌గా రికార్డులకెక్కాడు.



## మేఘా శుక్లా గ్లామర్ ట్రీట్

బాలీవుడ్ నటి మేఘా శుక్లా తన అందచందాలతో ఆకట్టుకొంటుంది. తన యాక్టింగ్‌తో కాకుండా సోషల్ మీడియాలో ఫోటోషూట్‌తో అలజడి సృష్టిస్తుంది. తాజాగా ఆమె చేసిన ఫోటోషూట్ ఇండస్ట్రీని షేక్ చేస్తున్నది. ఈ అందాల భామ కథల్: ఏ జాక్ ఫ్రూట్ అనే సినిమా ద్వారా మంచి పాపులారిటీ సొంతం చేసుకొన్నది. ఈ బ్యూటీ అందాలను చూసి తరించగలమా?

